

## కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30 వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,433మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,879మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,724మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,092, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 319మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 260మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 69మంది భక్తులు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,167 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

## వయనాడ్ ఎన్నికల బరిలో తిరుపతి జిల్లావాసి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న డాక్టరు నాగేశ్వర రావు

ఇంతకాలం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రాతినిధ్యం వహించిన కేరళ రాష్ట్రం వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండకు చెందిన డాక్టర్ దుగ్గిరాల నాగేశ్వరరావు పోటీ చేస్తున్నారు.రాహుల్‌గాంధీ రాజీనామా నేపథ్యంలో ఆయన సోదరి ప్రియాంకగాంధీ ఇక్కడ కాంగ్రెస్ తరఫున బరిలో వున్న విషయం తెలిసిందే.ఇక్కడ పోటీ చేస్తున్న 16 మంది అభ్యర్థుల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్. రాజన్ తప్ప మిగతా వారంతా స్థానికేతరులు కావడం విశేషం. పోటీ చేస్తున్న ఇద్దరు తెలుగు వారిలో ఒకరైన డాక్టర్ నాగేశ్వరరావు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈయన జాతీయ జనసేన పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి

## యూట్యూబ్‌లో చూసి దొంగ నోట్లు ముద్రించి

- పుత్తూరులో పట్టుబడిన నిందితులు
- నిందితుల్లో ఒకరు శ్రీకాకుళం జిల్లావాసి
- కారు, వస్తువుల సహా నోట్లు స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీసులు



నకిలీ కరెన్సీకి వాడిన వస్తువులు

పుత్తూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'నకిలీ నోట్లు ఎలా ముద్రించాలి?' అనేది యూట్యూబ్‌లో చూశారు. ఆ ప్రకారం వస్తువులు తీసుకొచ్చి ముద్రణ చేపట్టారు. వీటిని చెలామణి చేసే క్రమంలో పట్టుబడ్డారు. నిందితులను తిరుపతి జిల్లా పుత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆదివారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మునికృష్ణారావుకు ఫేస్‌బుక్ ద్వారా తిరుపతిలోని రమేష్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి రమేష్ ఇంట్లో షేర్ మార్కెట్ బిజినెస్ చేసేవారు. ఇందులో నష్టాలు వచ్చాయి. దీంతో డబ్బు సంపాదనకు అడ్డమార్గం ఎన్నుకున్నారు. కరెన్సీ నోట్లను ముద్రించే విధానాన్ని యూట్యూబ్‌లో తెలుసుకున్నారు. దీనికి రమేష్ భార్య సంధ్య, కుమార్తె ఇషా తోడయ్యారు. వీరు నలుగురు తిరుపతిలోనే నోట్ల ముద్రణకు కావాల్సిన వస్తువులను కొని ఇంట్లోనే ముద్రించేవారు. ఆ దొంగ నోట్లతో శ్రీకాళహస్తి, తిరుపతి, రేణిగుంట, పుత్తూరులో వస్తువులను కొనుగోలు చేస్తూ మార్చేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం రమేష్, ఇషా పుత్తూరు పట్టణం మండివీధిలోని నిర్మల ప్రొవిజన్ స్టోర్, జగన్నాథం ప్రొవిజన్ స్టోర్, శ్రీకృష్ణ స్టోర్స్ శంకర్ దుకాణాలు వంటి పలు దుకాణాల్లో తమ వద్ద నున్న రూ.500 నోట్లతో పలు వస్తువులను కొనుగోలు చేశారు. వారిచ్చిన నోట్లను ఒక దుకాణాదారుడు కరెన్సీ యంత్రంలో లెక్కించగా అది దొంగ నోట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పుత్తూరు సీఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఆ దుకాణం వద్దకు వెళ్లి సీసీ కెమెరా ద్వారా దొంగనోట్లను ఇచ్చిన వారిని గుర్తించారు.వీరు మరో దుకాణంలో వస్తువులు కొనుగోలు చేస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. తిరుపతి, చెర్లోపల్లె సర్కిల్‌లో ఒక ఇంట్లో నోట్లను ముద్రిస్తున్నట్లు చెప్పడంతో, పోలీసులు ఆ ఇంట్లో సోదాలు నిర్వహించారు. నోట్ల ముద్రణకు కావాల్సి వస్తువులు, ప్రింటర్లు, ల్యామినేషన్ యంత్రం, స్క్రీన్ ప్రింటింగ్, కలర్ లిక్విడ్స్, కట్ చేయడానికి సిద్ధంగా ఉన్న 192 రూ.వంద నోట్ల షీట్లు, 156 రూ.ఐదువందల నోట్ల షీట్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఎస్ఐ ఓబులయ్య, పోలీసులు పాల్గొన్నారు.

## గురుకులంలో 5వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

## ఏం కష్టమొచ్చిందో?



విలపిస్తున్న తల్లి రెడ్డి వాణి, (ఇన్‌సెట్‌లో) రెడ్డి మోక్షిత్ మృతదేహం

*ఆ చిన్నారికి ఏం కష్టమొచ్చిందో పాపం.. డార్మిటరీలోని ఐటర్‌కాట్‌కు టవల్‌ను బిగించి ఉరేసుకుని చనిపోయాడు. అంతవరకు తమతో పాటే వంట పనుల్లో సాయం చేసిన ఆ చిన్నారి.. విగతజీవిగా మారిపోవడంతో సహచర విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్యారంపల్లె గురుకులంలో 5వ తరగతి చదువుతున్న తిరుపతి జిల్లాకు చెందిన రెడ్డిమోక్షిత్ మృతి కలకలం రేపింది.*

పీలేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం గ్యారంపల్లెలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర గురుకులం)లో 5వ తరగతి చదువుతున్న డి.రెడ్డి మోక్షిత్(10) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఇతడు తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లులోని దిగువవీధికి చెందిన డి.కృష్ణమూర్తి, డి.వాణి దంపతుల కుమారుడు. రోజులాగే ఆదివారం కూడా ఉదయాన్నే నిద్రలేచిన ఇతడు సహచర విద్యార్థులతో కలిసి కాసేపు పాఠశాల హాస్టల్‌లో వంట పనుల్లో సాయం అందించాడు. ఒక్కసారిగా డార్మిటరీలోకి వెళ్లి తన టవల్‌తో ఐరన్ కాట్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనను గుర్తించిన ఇతర విద్యార్థులు వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేశారు. వారు హుటాహుటిన పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. ఆస్పత్రిలో ఆ విద్యార్థి తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది. రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి చేరుకుని రెడ్డి మోక్షిత్ కుటుంబీకులను ఓదార్చారు. తమ బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పడంతో సంఘటనపై సమగ్ర విచారణకు కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారని, విచారణలో తప్పు తేలితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారికి నచ్చజెప్పారు. అక్కడే ఉన్న గురుకులం ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిని డీఈవో సుబ్రహ్మణ్యంతో కలిసి విచారించారు. రెడ్డి మోక్షిత్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, డీబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు, స్థానిక ప్రజాసంఘాల నేతలు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. డీఈవో సుబ్రహ్మణ్యం ఆదివారం సాయంత్రం గ్యారంపల్లెలోని గురుకులానికి చేరుకుని సంఘటనపై ఉపాధ్యాయులను విచారించారు. రెడ్డి మోక్షిత్ మృతి సంఘటనపై కలెక్టర్ విచారణకు ఆదేశించారని, పోస్టుమార్టం నివేదిక అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని ఆర్డీవో స్పష్టం చేశారు.

## చెరువులో పడి ఇద్దరు యువకుల మృతి





మృతిచెందిన శ్రీకాంత్, ఆనంద్‌బాబు

చిల్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం అన్నంబాక గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటేశ్వర్లు, నాగమణి దంపతుల కుమారుడు శ్రీకాంత్(18), దావీదు, సంధ్య దంపతుల కుమారుడు ఆనంద్‌బాబు(18), మరో యువకుడు కల్యాణ్ ఆదివారం గ్రామ సమీపంలోని మర్రిగుంట చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తు శ్రీకాంత్ చెరువులో పడిపోవడంతో అతడిని కాపాడేందుకు ప్రయత్నిస్తూ ఆనంద్‌బాబు కూడా నీటిలో మునిగిపోయాడు. దీనిని గమనించిన కళ్యాణ్ కేకలు వేస్తూ స్థానికులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు చెరువులో దిగి గాలించగా శ్రీకాంత్, ఆనంద్‌బాబు మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేటి నుంచే ప్రభుత్వ భూముల సర్వే

తిరుపతి అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ భూములను సోమవారం నుంచి సర్వే చేయనున్నారు. పక్కాగా రికార్డుల్లోకి ఎక్కించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. జీవకోన, ఎర్రమిట్ట, తిమ్మనాయుడుపాళెం, అక్కారంపల్లి, మంగళం, తుడా క్వార్టర్స్ బొమ్మల క్వార్టర్స్, కోళ్లఫారం, శెట్టిపల్లి, కొర్లచెన్నాయిగుంట, కొరమేనుగుంట తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు, కాలువ, చెరువుల పోరంబోకు స్థలాలున్నాయి. పారదర్శకంగా సర్వే చేసి, ఈనెల 20వ తేదీలోపు నివేదిక అందజేయాలని అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. పొరపాట్లు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి భూ ఆక్రమణలు ఎక్కువైన నేపథ్యంలో ఉన్న భూములను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ సర్వే చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.

## సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ అయ్యాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను విస్మరించింది. చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో సాగునీటి సంఘాలకు జీవపోసింది.



తొమ్మిదేళ్ల తర్వాత వీటికి ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని 608 చెరువులు, రెండు మీడియం ప్రాజెక్టులకు ఈనెల 23వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. సుమారు 3,800 మంది రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సభ్యుల ఎన్నిక పూర్తయ్యాక సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను అదే రోజు ఎన్నుకుంటారు. ఎన్నికల విధులకు జిల్లాలో 3,600మందిని నియమించారు. వీరిలో ఉపాధ్యాయులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. ఒక్కో సంఘానికి ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి, ప్రతి ప్రాదేశికం(టీసీ)కు పీవో, ఏపీవోలను నియమించారు. జిల్లాలో అరణియార్, స్వర్ణముఖి మీడియం ప్రాజెక్టుతోపాటు 608 చెరువులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ 610 కింద 2,00,711ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. జిల్లా స్థాయిలో ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇక, 13 నుంచి మండల స్థాయిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. మైనర్ ఇరిగేషన్‌లో ఆరుగురిని సభ్యులుగా ఎన్నుకుంటారు. 'ఈనెల 23న సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాం. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధమైంది. ఆయా పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శిస్తాం' అని టీజీపీ జీఎన్ఎస్ఎస్ సర్కిల్ ఎస్ఈ మదనగోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

## ఎస్వీయూలో ముగిసిన యువ తరంగ్







విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో మూడు రోజులుగా నిర్వహించిన 'యువతరంగ్' కార్యక్రమం ఆదివారం ముగిసింది. విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీనివాసా ఆడిటోరియంలో సాయంత్రం నిర్వహించిన ముగింపు సభలో పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్ ప్రసంగించారు. యూనివర్సిటీ జీవితం ఓ మరుపురాని తియ్యటి జ్ఞాపకమంటూ తాను ఎస్వీయూ పీజీ, పీహెచ్‌డీ చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యూనివర్సిటీ చదువులు జీవితాన్ని కీలక మలుపు తిప్పుతాయని తన జీవితం నిరూపించిందన్నారు. ఎస్వీ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా వర్సిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. క్రీడా సాంస్కృతిక విషయాల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి ఆయా రంగాల్లో వారిని ప్రోత్సహించడానికి యువ తరంగ్ నిర్వహించామని ఇన్‌చార్జి వీసీ అప్పారావు తెలిపారు. యువ తరంగ్‌లో విద్యార్థుల ఉత్సాహం చూస్తుంటే తనకు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని రిజిస్ట్రార్ భూపతి నాయుడు అన్నారు. వివిధ సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్, విద్యార్థులు, ఉద్యోగులు, కళాకారులు పాల్గొన్నారు.





## 'సీమ' సిగలో మరో బీచ్

పర్యాటక శాఖ దృష్టి పెట్టని మరో బీచ్ జిల్లాలో ఉంది. పెద్దగా వసతులు లేకపోయినా పర్యాటకులు అధిక సంఖ్యలో వెళ్తుంటారు. ఆ బీచ్ ఎక్కడుంది? ఎలా వెళ్లాలి?


- పూర్తి వివరాలు 8లో -




## సీఐటీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక


జిల్లా నాయకుడు మదుసూదన్‌రావ్,తదితరులు

పాకాల, నవంబరు 10: సీఐటీయూ మండల శాఖ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు మదుసూదన్‌రావ్ ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. మండల శాఖ కన్వీనరుగా ప్రసాద్, కో కన్వీనర్లుగా మురళి, వెంకటరత్నం, పెద్దబ్బ, కమిటీ సభ్యులుగా తంబి, వెంకటేష్, దనమ్మ, గురవయ్య, సుగుణమ్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగ మదుసూదన్‌రావ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, సంఘమిత్రలకు 104, 108 తదితర కార్మికులకు బకాయి వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు.

## డిసెంబరు 15న తొగటవీర క్షత్రియ సంఘ వనభోజనం


సమావేశంలో మాట్లాడుతున్న మందపల్లెబాబు

భాకరాపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక వనభోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు మందపల్లెబాబు కోరారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డలో ఆదివారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 15న రంగన్నగారిగడ్డ సమీపంలోని కొల్లాపురమ్మ ఆలయం వద్ద కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నుంచి సంఘ నాయకులు హాజరవుతున్నారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పురం మల్లయ్య, జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, కోశాధికారి వెంకటరత్నం, మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య, రమేశ్, లక్ష్మీనరసింహ, మదనమోహన, నాగభూషణం, చౌడయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు


ఎస్సై డీవై స్వామి

భాకరాపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండల పరిధిలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. భాకరాపేట పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెల్టు షాపులు, నాటు సారా తయారీ, విక్రయాలు లాంటివి చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సమాచారం ఉంటే 9490617880, 9440900711 నంబర్లకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ● ఎర్రావారిపాలెం; మద్యం బెల్టు షాపులు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ ఇమ్రాన్ ఖాన్ ఎర్రావారాపాలెం ఎస్సై డీవై స్వామి తెలిపారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం తరలించినా, అమ్ముతున్నా కేసులు నమోదు చేస్తామన్నారు. బెల్టె షాపులకు మద్యం సరఫరా చేస్తే షాపుల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి సమాచారం ఉంటే 94409 00708, 94906 17880 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

## నేటి నుంచి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు



చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ఈనెమల 20 వరకు రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 5 గంటలకు స్వామి అమ్మవార్లకు అభిషేకం, 7 గంటలకు అగస్త్యేశ్వరస్వామికి విభూది అభిషేకం, సాయంత్రం 6 గంటలకు ఉత్సవాలు భూమిపూజ చేయనున్నారు. మంగళవారం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహిస్తారు. రాత్రి స్వామి మూషిక వాహనంపై వినాయకస్వామి, 13న ఉదయం మయూర వాహనంపై వళ్లీదేవసేన, సుబ్రమణ్యంస్వామి, రాత్రి సింహ వాహనంపై ఆనందవళ్లిదేవి, 14న ఉదయం శేష వాహనంపై, రాత్రి భూత వాహనంపై స్వామి అమ్మవార్లు భక్తులను అనుగ్రహిస్తారు. 20వ తేదీ ఉదయం త్రిశూలస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి కోరారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు


పార్లమెంటరీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు


కొలుసు పార్థసారథి-సత్యనారాయణ

తిరుమల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్ష, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఉన్నారు. అలాగే పార్లమెంటరీ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ భర్తుహరి మహతాబ్ ఆధ్వర్యంలో సభ్యులు కూడా దర్శించుకున్నారు. వీరికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం మంత్రి పార్థసారథి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. అనేక ఇబ్బందికర పరిస్థితులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వ నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. వీరి ప్రయత్నాలకు శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్టు తెలిపారు. అంతకుముందు భర్తుహరి మహతాబ్ కూడా మీడియాతో మాట్లాడుతూ తిరుమలకు ప్రత్యేకమైన వైభవం ఉందన్నారు.

## 26న ధర్నాకు సిద్ధం కండి: ఏఐటీయూసీ



సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు కార్మికులు, కర్షకులు సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నాగ సుబ్బారెడ్డి కోరారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మికులు, కర్షకుల వ్యతిరేక విధానాలపై చర్చించారు. నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు అందించాలన్నారు. రైతులకు క్రాప్ రుణాలు, పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్లపై పనిభారం పెరిగిందని తెలిపారు. ఇవే డిమాండ్లతో ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కె.రాధాకృష్ణ, ఎన్ డీ రవి, కె.వై.రాజా, వైఎస్ మణి, ఉదయ్ కుమార్, నాగేంద్ర, హేమావతి పాల్గొన్నారు.

### ఘట్కా పోటీలు...
## జాతీయస్థాయి జట్ల ఎంపిక




జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన అండర్19 బాల, బాలికల జట్లు బాలికలు

రేణిగుంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఘట్కా ఎంపిక పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ఏజీఎఫ్ కార్యదర్శి జయరామయ్య, హెచ్‌డీఎఫ్ కార్యదర్శి బాబు, స్టేట్ అబ్జర్వర్ బాలశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని ప్రదానం చేశారు. డిసెంబరు 1, 2, 3, 4వ తేదీల్లో డిల్లీలో జరిగే జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని రాష్ట్ర అబ్జర్వర్ బాలశేఖర్ తెలిపారు. ప్రతి జట్టుకు ముగ్గురిని స్టాండ్‌బైగా ఎంపిక చేశామన్నారు.

ఎంపికైన జట్ల వివరాలివీ...

**అండర్19 బాలురు:** కె.పవన్‌కుమార్, గణేష్, వంశీరెడ్డి(వైజాగ్), జగదీష్‌రాం, హేమంత్ కుమార్(కృష్ణ), నాగవేణు(కడప), చందనాయక (చిత్తూరు), దేవకుమార్(ప్రకాశం).

**అండర్17 బాలురు:** హరిచరణ్, సాయిగణేష్, కుషాల్ వెంకట్(ఈస్ట్‌గోదావరి), నవీన్, జయసూర్య (కడప), మనోజ్(కర్నూల్), హర్షవర్థన్ (వైజాగ్), నరేంద్ర(కృష్ణ)

**అండర్19 బాలికలు:** ధాత్రి, రోజా, రాజశ్రీ (చిత్తూరు), జ్యోత్స్న, ఉదయశ్రీ, మమత (వైజాగ్), షణ్ముఖి(ఈస్ట్‌గోదావరి), ధరణి (ప్రకాశం).

**అండర్17 బాలికలు:** దీక్షిత, హరితసెల్వి, కీర్తన(కడప), జాస్మిత(వైజాగ్), కారుణ్య హర్షిత(ఈస్ట్‌గోదావరి), వర్ష(కర్నూల్), సరయ(కృష్ణ)

# చంద్రగిరి

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నాగరాణి ఎంపిక



భాకరాపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు నాగరాణి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె 2012లో ఏపీపీఎస్సీ ద్వారా అధ్యాపక పోస్టుకు ఎంపికై మొదట తంబళ్లపల్లె కళాశాలలో, 2021లో చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఆమె విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు ఉత్తమ విలువలు నేర్పిస్తూ, పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నారు. విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకోనున్నారు.

## ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాటయ్య


కాటయ్య- పట్టాభిరామయ్య

తిరుపతి(విద్య), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ-ఏపీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పి.కాటయ్య, కార్యదర్శిగా ఆర్.పట్టాభిరామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పులిచెర్లకు చెందిన పి.కాటయ్య, బీఎన్ కండ్రిగకు చెందిన పట్టాభి రామయ్య ఎన్నికయ్యారు. సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్ కుమార్ ఆదివారం వారిని అభినందించారు.

## సభ్యత్వ నమోదు జోరు పెంచండి

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో జోరు పెంచాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ అంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం సభ్యత్వ నమోదుపై టీడీపీ నాయకులతో ఆయన సమీక్షించారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోద య్యేలా చురుగ్గా వ్యవహరించాలని కోరారు. టీడీపీ సభ్యత్వ నమోదు ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్యనాయుడు, రమేష్ పాల్గొన్నారు.

# పేరూరు చెరువులో మట్టి మాఫియా

- హిటాచీలతో మట్టిని తోడేస్తున్నారు
- గ్రామస్తులు అడ్డుకున్నా ఆగని వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు


యథేచ్ఛగా ఇలా మట్టి తవ్వకాలు

తిరుపతిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు చెరువులో మట్టిమాఫియా తిష్టవేసింది. రాత్రి పగలు తేడా లేకుండా హిటాచీలతో పరిమితికి మించి మట్టిని తీసి టిప్పర్లతో తరలిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఇటుక బట్టీల నిర్వాహకులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల గ్రామస్తులు టిప్పర్లను అడ్డగించినా అక్రమ మట్టి రవాణా ఆగడం లేదు. దీంతో చెరువు రూపురేఖలు కోల్పోవడమేగాక బావులను తలపించేలా పెద్దఎత్తున గుంతలు ఏర్పడుతున్నాయి. ఇదేపరిస్థితి కొనసాగితే చెరువులో బంకమన్ను తరలిపోయి కేవలం గులకరాళ్లు మాత్రమే మిగులుతాయని, తద్వారా చెరువులో నీరుచేరినా ఎక్కువకాలం నిలవ ఉండదని గ్రామస్తులు వాపోతున్నారు. గత వైసీపీ నేతలకు ఏమాత్రమూ తీసిపోని విధంగా కూటమి పార్టీ నేతలు అక్రమ రవాణాను విచ్చలవిడిగా సాగిస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తిచూడని పరిస్థితి.

### టిప్పర్ మట్టి ధర రూ.6-7వేలు

చెరువులో 8 హిటాచీలతో రోజూ మట్టిని తవ్వి టిప్పర్ ధర రూ.6-7వేల చొప్పున స్థిరాస్తి, ఇటుక బట్టీల వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దాదాపు 20 అడుగుల మేర మట్టి తవ్వకాలు చేపట్టి 30టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన కూటమి పార్టీ నేతలతో గ్రామస్తులు కలసి రోడ్డుపై టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మార్‌పల్లె సీఐ, మండలానికి చెందిన కూటమి పార్టీ ద్వితీయ శ్రేణి నేత అక్కడికి చేరుకుని మట్టితవ్వకాలు జరగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వెనుదిరిగారు. అయినా తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు.


మట్టి తవ్వకాలతో గుంతలుగా మారిన చెరువు

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు: సీఐ

చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని స్వర్ణముఖి నది నుంచి ఇంటి అవసరాలకు మాత్రమే ఇసుక తరలించుకోవాలని సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగత అవసరాలకు కాకుండా ఇతర జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు ఇసుక రవాణా చేస్తే సహించేది లేదన్నారు. జేసీబీ లాంటి యంత్రాలతో స్వర్ణముఖి నదిలో ఇసుక తోడితే చర్యలు తప్పవన్నారు. ట్రాక్టర్ల యజమానులు సైతం కూలీల సాయంతో ఇసుక నింపుకొని గృహ నిర్మాణాలకు అందించాలని స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో ఇతర వ్యక్తుల గురించి అవమాన పరిచేలా, అసభ్యకరంగా పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ అనిత తదితరులు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావం సన్నాహక సమావేశం


శ్రీకాళహస్తిలో కరపత్రాల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను స్వయంప్రతిపత్తి కలిగిన ధార్మిక వ్యవస్థలకు అప్పగిస్తూ చట్ట సవరణ చేయాలని విశ్వహిందు పరిషత్ తిరుపతి విభాగ ప్రముఖ్ మల్లికార్జున డిమాండ్ చేశారు. విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు సంబంధించి ఆదివారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీపురం మండలాల కార్యకర్తలతో సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... దేవాలయాలను ప్రభుత్వం తన నిర్వహణలో ఉంచుకుని రాజకీయ పదవులకు పునరావాస, వ్యాపార కేంద్రాలు మారుస్తూ ఆధ్యాత్మిక విలువలకు తిలోదకాలు ఇస్తోందన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శశాంక్, అంజూరు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం:** హైందవ శంఖారావం బహిరంగ సభకు తరలిరావాలని ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ గురుస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని నైస్ స్కూల్‌లో ఆదివారం ఆయనకు చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. దేవాలయాల్లో, దేవ దాయ ధర్మదాయ శాఖలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేని హిందూ భక్తులకు పదవులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ‘108’కు సుస్తీ



ఆస్పత్రి ఆవరణలో నిలిపి ఉన్న 108 అంబులెన్స్

తిరుపతి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళం పీహెచ్‌సీలోని 108 అంబులెన్స్ మరమ్మతులకు గురైంది. 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ పీహెచ్‌సీకి 108 అంబులెన్స్‌ను కేటాయించింది. ఐదు పంచాయతీలకు కలిపి ఒకే అంబులెన్స్ కావడం, రోడ్లు సరిగా లేకపోవడంతో రెండేళ్లకే పాడైపోయింది. ముందు చక్రాలకు ప్లేట్లు విరిగిపోయి, వాహనం ఒక వైపునకు ఒరిగిపోయింది. ఎక్కడపడితే అక్కడ ఆగిపోతుండడంతో తోయాల్సి వస్తోంది. లోపల వైద్య పరికరాలు కూడా సరిగా పనిచేయడంలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఇలాంటి వాహనాల వల్ల ఉపయోగం లేదని, కొత్తది ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

## పోక్సో కేసుల నమోదు

ఏర్పేడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఏర్పేడు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. రేణిగుంటకు చెందిన యువకుడు ఏర్పేడుకు చెందిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

**శ్రీకాళహస్తి:** బాలికను వేధిస్తున్నాడన్న ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశా రు. సీఐ రవి నాయక్ తెలిపిన వివరాలు... మేరకు శ్రీకాళహస్తి మండలానికి చెందిన బాలికను యువకుడు వేధించేవాడు. దీనిపై బాలిక తన తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. రెండు కుటుంబాల నడుమ శనివారం గొడవ జరిగింది. బాలిక బం ధువు తలకు తీవ్రగాయమైంది. ఆయన్ను ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదైంది.

### ఆగమోక్తంగా ఆకాశదీపం

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ వేద పండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

## దక్షిణాది కరాటే ఓవరాల్ చాంపియన్ ఆంధ్రా


ఓవరాల్ చాంపియన్‌షిప్ ఆంధ్రాజట్టు


కటా విజేతగా తిరుపతివాసి సూర్య

తిరుపతి(క్రీడలు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దక్షిణాది ఓపెన్ కరాటే పోటీలలో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆంధ్రా జట్టు నిలిచింది. శ్రీనివాస క్రీడా సముదాయంలో రెండు రోజులుగా జరిగిన ఒకటో ఓపెన్ దక్షిణాది కరాటే పోటీలు ఆదివారం ముగిశాయి. తుదిపోరులో ఆంధ్రా, కర్ణాటక జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆంధ్రా జట్టునే చాంపియన్‌షిప్ వరించింది. కర్ణాటక రన్నరప్‌తో సరిపెట్టుకొంది. తమిళనాడు మూడు, తెలంగాణ నాలుగు, కేరళ ఐదు, పుదుచ్చేరి ఆరో స్థానాలకు పరిమితమయ్యాయి. ఇక మెన్స్ ఓపెన్ కటా విభాగంలో ఏపీ పోలీస్ టీం సభ్యుడు సీహెచ్ వెంకటేష్‌పై తిరుపతికి చెందిన వి.సూర్య గెలుపొందాడు. ఉమెన్ కుమితే విభాగంలో తిరుపతికి చెందిన ఆర్.వాసవిపై ఎస్.వెంకటసుజిత విజయం సాధించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చదరంగం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాలర్స్ దివాకర్‌రెడ్డి విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. చీఫ్ ఆర్గనైజర్ రత్నాకర్, వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం.విజయన్, ఎస్.జోరం, మునస్వామి, శివదాసన్, సంజయ్, గోవిందరాజు, డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.













## అలరించిన ఆటల పోటీలు

ఎస్వీయూలో చివరి రోజైన ఆదివారం ‘యువతరంగ్’ కార్యక్రమంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలు అలరించాయి. తమ ప్రతిభతో విద్యార్థులు మైమరిపించేశారు. మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ముగింపు సభలో బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

## స్కేటింగ్ పోటీల్లో ఖ్యాతికి బంగారు పతకం



తిరుపతి(క్రీడలు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ వేదికగా ఈ నెల 6వ తేదీ నుంచి జరిగిన 36వ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో తిరుపతికి చెందిన ఖ్యాతి బంగారు, రజిత, 3కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. వచ్చేనెల మొదటి వారంలో మైసూరులో జరిగే జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు అర్హత సాధించింది. ఈ బాలిక టీటీడీ హెచ్‌ఆర్ వింగ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్తె. తల్లిదండ్రులతో పాటు పలువురు క్రీడా ప్రముఖులు ఆమెను అభినందించారు.

## సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి



తిరుపతి(కల్చరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు సూరీడు సీపీ బ్రౌన్ జయంతి ఘనంగా నిర్వహించారు. బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. తెలుగు భాషకు, తెలుగు పుస్తక సేకరణకు బ్రౌన్ చేసిన కృషి, సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గోపినాథరెడ్డి, కేఎస్ రాజ, కప్పా పద్మనాభం, కే కేశవరెడ్డి, లక్ష్మయ్య, రహీం, గురుప్రసాద్, చంద్రబాబు, సూర్యప్రకాష్, ఆనంద్, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ సంఘం వన భోజనాలు



తిరుపతి(కల్చరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వినాయక సాగర్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన భోజనాలు నిర్వహించారు. వడమాలపేట మండలం ఉమామహేశ్వరాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 300 మంది పాల్గొని, శివాలయంలో అభిషేకం చేశారు. అనంతరం అందరికీ భోజనాలు అందజేశారు. సభ్యులకు 2025 డైరీలు, క్యాలెండర్లు, జ్ఞాపికలను అందజేశారు. వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం




మాట్లాడుతున్న శేషారెడ్డి

తిరుపతి(ఆటోనగర్) నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం తిరుపతిలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో డిప్లొమా ఇంజనీర్స్ పదోన్నతులు, ఇతర సమస్యలపై స్టేట్ సెక్రటరీ జనరల్ శేషారెడ్డి ఆధ్వర్యంలో చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.చంద్రమోహన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా జి.నాగరాజ, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా పీ రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా ఎం.యోగానంద, డి.వెంకటేశ్వర్లు, వైసీ గణపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె.బి.బాలచంద్రన్, ఎన్.మదన్‌మోహన్, ఆఫీస్ సెక్రటరీగా టి.అనంత కుమార్, ఫైనాన్స్ సెక్రటరీగా ఎ.గుణశేఖర్, మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.ఓబులమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు కె.వీరయ్య చౌదరి, శేషారెడ్డి, పి.హుసేన్ ఖాన్‌లు వెల్లడించారు. 9 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు.





## రోడ్డును బాగు చేశారు




తిరుపతి(గాంధీరోడ్డు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు వెనుక వైపు సర్కిల్ నుంచి పీఎల్‌ఆర్ హోటల్ వైపునకు వెళ్లే మార్గంలో రోడ్డు కంకరతేలి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయమై ఆ మార్గంలో ప్రయాణిస్తే బోర్లాపడాల్సిందే శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు గుంతలను పూడ్చి రోడ్డు వేశారు. స్థానికులు, షాపు యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 15న యోగుల పర్వతంపై దీపోత్సవం

తిరుపతి(కల్చరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన రామచంద్రాపురం మండలంలోని యోగుల పర్వతంపై అఖండ కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ ప్రకటించింది. ఆదివారం ఉదయం తిరుపతిలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మద్యం స్వాధీనం..ఇద్దరి అరెస్ట్



తిరుపతిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 53 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడు వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె వద్ద దేవరాజ్ కుమార్(41) అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా 25 మద్యం బాటిళ్లు దొరికాయి. రేణిగుంట మండలం కరకం బాడి ఆర్చ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన హుస్సేన్‌బాషాను తనిఖీ చేయగా 28 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వారిపై కేసు నమోదు చేశారు.

## వానొస్తే..జలమయం



తిరుపతి, జీవకోన, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షం వచ్చినా లీలామహల్-కరకంబాడి రోడ్డు జలమయంగా మారుతోంది. మాధవనగర్ ముందు నుంచి ఉపాధ్యాయ నగర్ ప్రధాన రోడ్డు వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. గురువారం కురిసిన వర్షానికి రోడ్డు జలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు.

## నేటి నుంచి క్రీడా సాంస్కృతిక సమ్మేళనం

తిరుపతి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల మొదటి విడత క్రీడా, సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనాన్ని సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని వ్యవసాయ, వ్యవసాయ ఇంజినీరింగ్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీలకు చెందిన 410 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్ అధ్యక్షతన జరిగే ప్రారంభ కార్యక్రమానికి అతిథులుగా ఎన్జీరంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ శారదజయలక్ష్మి, ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి హాజరవుతారని తెలిపారు.

## నామినేటెడ్ పదవుల్లో జనసేనకు ప్రాధాన్యతివ్వండి

తిరుపతి, నవంబరు10(ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో జనసేన నాయకులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు ఎం.నరసింహులు నాయుడు, సోమశేఖర్, కృష్ణయ్యలు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. వైసీపీ ఓటమి కోసం, కూటమి గెలుపు కోసం జనసేన నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారని, నామినేటెడ్ పదవుల్లో జిల్లాలోని జన సైనికులకు తగిన గుర్తింపు లేదన్న సంకేతాలు వెళుతున్నాయని పేర్కొన్నారు. మిగిలిన పదవుల్లోనైనా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## దుబాయ్‌లో ఎమ్మెల్యేకు సన్మానం



తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్ పర్యటనలో ఉన్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ఆదివారం ప్రవాసాంధ్రులు ఘనంగా సన్మానించారు. తిరుపతికి చెందిన ఏపీఎస్‌ఆర్టీ మాజీ సభ్యుడు డాక్టర్ ముక్కు తులసీకుమార్, కటారి సుదర్శన్ తదితరులు శాలువా, జ్ఞాపికను అందజేశారు.

## నేడు గంగమ్మ గుడిలో వేలం పాటలు

తిరుపతి(కల్చరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో సోమవారం లీజు హక్కు వేలం నిర్వహించనున్నట్లు ఈవో జయకుమార్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో సంవత్సర కాలానికి ఆలయంలో చీరలు, రవిక పీసులు, కొబ్బరి చిప్పలు, సజీవ కోళ్ల సేకరణ, వెయ్యికళ్ల దుత్తల విక్రయం, పాదరక్షలు భద్రపరచడం తదితర హక్కుల వేలం పాట జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని పేర్కొన్నారు.

# అసంపూర్తిగా కాలువ నిర్మాణం

● గుంతలుతీసి వదిలేసిన వైనం ● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

తిరుపతి (జీవకోన), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-కరకంబాడి రోడ్డుకు వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఎయిర్‌పోర్టు నుంచి తిరుమలకు వెళ్లే వీఐపీలు ఇదే మార్గంలో వెళుతుంటారు. అలాంటి ప్రధాన రహదారిలో గత ప్రభుత్వ హయాంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అయితే సుబ్బారెడ్డి నగర్ నుంచి లీలామహల్ వైపు కొంత దూరం వరకు పనులు అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల ఆ నిర్మాణాన్ని చేపట్టేందుకు పూడిక పనులు చేపట్టారు. పెద్దయెత్తున గుంతలు తీశారు. ఏమైందో ఏమో పనులను మళ్లీ ఆపేశారు. ఈ క్రమంలో అక్కడ తీసిన మట్టి వర్షానికి కొట్టుకొని రోడ్డుపైకి వచ్చి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. పైగా రాత్రి సమయాల్లో అటుగా వచ్చే వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. కాగా, ఇళ్లు, దుకాణాలు ముందు నెలల తరబడి గుంతలు అలాగే వదిలేయడంతో స్థానికులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత కార్పొరేషన్ అధికారులు స్పందించాల్సి ఉంది.



సుబ్బారెడ్డి నగర్ వద్ద బావిని తలపిస్తున్న కాలువ

# జీవితంలో గెలుపోటములు సహజం

'నా అడుగు ఎప్పుడూ ముందుకే' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

తిరుపతి(కల్చరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవితంలో గెలుపోటములు సహజమని, ఉన్న అవకాశాలను వినియోగించుకుని ముందుకు సాగాలని, అదే నీతిని 'నా అడుగు ఎప్పుడూ ముందుకే' పుస్తకం తెలియజేస్తోందని వక్తలు పేర్కొన్నారు. తిరుపతికి చెందిన విద్యావేత్త, అధ్యాపకుడు డాక్టర్ వీఎస్ రమేష్ బాబు ఆత్మకథ 'నా అడుగు ఎప్పుడూ ముందుకే' పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్వీయూ పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్వీయూ వీసీ ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, విశ్రాంత ఎస్పీ ఎం.వి.ఎస్.స్వామి, శ్వేత పూర్వ సంచాలకులు భూమన్, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు కె.శేషయ్య, రచయిత కోట పురుషోత్తం, పద్మావతి మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సి.స్వరాజ్య లక్ష్మి, శంకరంబాడి సాహితీ పీఠం వ్యవస్థాపకులు డి.మస్తానమ్మ, ఆచార్య చంద్రయ్య, టీటీడీ పూర్వ డీఈవో నాగరాజ నాయుడు, కుప్పం వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ దామోదర నాయుడు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఇది కర్తవ్య నిష్ట కలిగిన వ్యక్తి జీవిత కథ అని, అందరూ చదివి వ్యక్తిత్వ వికాసం పొందవచ్చునని తెలిపారు. అనంతరం ప్రాశ్య పరిశోధనా సంస్థ, ఎస్వీయూ సంచాలకులు ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు పుస్తక సమీక్ష చేశారు. రచయిత రమేష్ బాబును ఆత్మీయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య దేవసేన నాయుడు, ఏ మంజునాథ్, సాకం నాగరాజ, వాకా ప్రసాద్, ఏనుగు అంకమనాయుడు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, ఆచార్య సి.గోవిందరాజులు, షణ్ముగం, డాక్టర్ మౌని, కంపల్లె రవిచంద్రన్ దంపతులు, భూపాల్ నాయుడు, జయరామ్ ప్రసాద్, పాస్ బాలకృష్ణ, శ్రీమన్నారాయణ, సురేంద్రనాథరెడ్డి, ఆచార్య శౌరయ్య, కొనిదెల శోభ, సుభద్ర పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

## 104 ఉద్యోగుల బాధ్యత ప్రభుత్వానిదే



ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు క్షేత్ర స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్న 104 ఉద్యోగుల బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట 104 ఉద్యోగులు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాల సుబ్రమణ్యం సంఘీబావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న 104 సిబ్బందిని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. మూడు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌సీల ద్వారానే 104 ఉద్యోగులను పర్యవేక్షించాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగులను ఆప్కాస్‌లో విలీనం చేస్తామని హామీ ఇచ్చి, మోసం చేసిందన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో నాగ వెంకటేష్, రామకృష్ణ, జయచంద్ర, టి.అమర్‌నాథ్. బత్తిరెడ్డి, మునిరాజ, వై.భువనేశ్వరి తదితరులు ఉన్నారు.

## కపిలతీర్థంలో ఘనంగా చండీయాగం



తిరుపతి(కల్చరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కామాక్షి అమ్మవారి హోమం(చండీయాగం) నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న ఈ హోమంలో భాగంగా యాగశాలలో ఉదయం పూజ, నిత్య హోమం, చండీహోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం హోమం, చండీ పారాయణం, సహస్రనామార్చన, విశేష దీపారాధన చేశారు. రూ.500 టికెట్టు తీసుకున్న గృహస్తులను అనుమతించారు. వారికి అన్నప్రసాదం, ఉత్తరీయం, రవికె అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణ అభివృద్ధికి కృషి చేయాలి



సదాశివంను సన్మానిస్తున్న సుగుణమ్మ

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నూతనంగా ఎన్నికైన కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివంకు సూచించారు. ఛైర్మన్‌గా ఎన్నికైన నేపథ్యంలో ఆయన సుగుణమ్మ నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపి ఆమె ఆశీస్సులు తీసుకున్నారు. రుద్రకోటిని సత్కరించారు. నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మునిబాల కుమార్, అధ్యక్షుడు కన్నెమడుగు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి భజంత్రీ మల్లికార్జున, రాష్ట్ర మహిళా కార్యదర్శి మల్లీశ్వరమ్మ, టీటీడీ కల్యాణకట్ట పీస్‌రేట్ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సత్యనారాయణ, శంకర్, మాజీ తహసీల్దార్ వెంకట్ రాయులు, చంద్రమోహన్, ఆవులపాటి దామోదరం, వాయిద్య కళాకారుల సంఘం నాయకులు సత్యనారాయణ, మునిరత్నం, గోవిందశెట్టి, రావిపాటి సత్యనారాయణ, ఎస్.మునిరత్నం, అవిలాల మునస్వామి, కృష్ణారావు, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, మీరయ్య తదితరులు రుద్రకోటిని సన్మానించిన వారిలో ఉన్నారు.



## రష్యన్ల రాహుకేతు పూజలు

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సుమారు 40మంది రష్యా దేశస్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని తెలిపారు. తాము స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

## శ్రీవారి సారె ట్రయల్ రన్

తిరుచానూరులో ఈనెల 28 నుంచి నిర్వహించనున్న ని పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆదివారం శ్రీవారి సారె ట్రయల్ రన్ నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు (వచ్చే నెల 6న) పంచమీతీర్థం సందర్భంగా అమ్మవారికి తిరుమల నుంచి శ్రీవారు సారె పంపడం ఆనవాయితీ. ఈ క్రమంలో ట్రయల్ రన్‌గా ఆదివారం ఉదయం డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, ఇతర టీటీడీ అధికారులు, సిబ్బంది కలిసి ఏనుగులపై అమ్మవారి నమూనా సారె తెచ్చారు. కోమలమ్మ సత్రం నుంచి రాములవారి గుడి, గాంధీరోడ్డు మీదుగా గోవిందరాజస్వామి ఆలయం, గ్రూప్‌థియేటర్స్, ఆర్టీసీ బస్టాండు, పూర్ణకుంభం సర్కిల్, లక్ష్మీపురం, పద్మావతిపురం మీదుగా తిరుచానూరు ఆలయం వరకు తీసుకువచ్చారు. సూపరింటెండెంట్లు రమేష్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి







ఆహ్లాదంగా పర్యాటకులు

# సీమ సిగలో మరో బీచ్

# శ్రీనివాససత్రం

**అభివృద్ధి పరిస్తే గొప్ప పర్యాటక క్షేత్రం అవుతుంది**



చెన్నై నుంచి కృష్ణపట్నంపోర్టుకు వెళ్తున్న స్టీమర్

ఎండకి మెరిసే ఇసుక మీదకి ఉరకలెత్తే అలలు.. సముద్రంలో సాగిపోయే పడవలు.. దూరంగా మసక దృశ్యంలా కృష్ణపట్నం ఓడరేవు.. పోర్టు దిశగా వెళ్లే స్టీమర్లు.. తీరంలో సవకతోపుల్లో చెట్ల కింద సేదదీరే పడవలు.. జీడిమామిడి చెట్లు.. మాల్దీవుల వర్ణన కాదు ఇది. మన తిరుపతి జిల్లాలో ప్రసిద్ధికెక్కని ఒక బీచ్ అందాలు ఇవి. కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీలోని శ్రీనివాససత్రం సముద్రతీరం సౌందర్యం వర్ణనాతీతం. పర్యాటక ప్రదేశంగా దీనిని గుర్తించి అభివృద్ధి పరచలేదు కానీ, సమీప ప్రాంతాల ప్రజలు సెలవు రోజుల్లో వచ్చి ఆహ్లాదంగా గడుపుతుంటారు. లోతు తక్కువగా ఉండడంతో అలలతో సయ్యాటలాడుతుంటారు. నీలపు రంగు పులుముకున్న సముద్రమూ, ఆకాశమూ నేపథ్యంగా ఫోటో షూట్‌లు చేసుకుంటూ ఉంటారు. ఇప్పటిదాకా ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా ఇక్కడ జరగలేదంటే ఇదెంత ప్రమాదరహితమైన ప్రదేశమో అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి పరిస్తే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా శ్రీనివాస సత్రం బీచ్ రూపు మారుతుంది.

జిల్లాల విభజనతో రాయలసీమకు సముద్రం కానుకగా వచ్చింది. ఆహ్లాదకరమైన పర్యాటక ప్రదేశంగా కోట సమీపంలోని తూపిలిపాళెం బీచ్ గుర్తింపు పొందింది. పెద్దగా వసతులు లేకపోయినా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వెళ్తుంటారు. అయితే రాష్ట్ర పర్యాటక శాఖ కన్ను పడని మరొక అందమైన బీచ్ కూడా కోట మండలంలో ఉంది. మంచి రోడ్డు వేసి, వసతులు కల్పిస్తే ఈ రెండు బీచ్‌లూ ఆదాయవనరులుగా మారుతాయి.

- కోట, ఆంధ్రజ్యోతి

### శ్రీనివాససత్రానికి ఇలా వెళ్లొచ్చు..

గూడూరు నుంచి కోట మీదుగా వెళ్లాలి. గూడూరు నుంచి కోటకు 26 కిలోమీటర్లు. అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో శ్రీనివాససత్రం ఉంటుంది. ఇక్కడిదాకా తారు రోడ్డు ఉంది. ఇక్కడి నుంచీ 500 మీటర్ల దూరంలో సముద్ర తీరం ఉంటుంది. సొంత వాహనాల్లో గానీ, కోట నుంచి ఆటోల్లోగానీ వెళ్లాలి. శ్రీనివాససత్రంలో టిఫిన్, భోజనం వంటివి లభించవు. ఇక్కడికి 5 కిలోమీటర్ల దూరంలోని గోవిందపల్లిలో మాత్రం హోటళ్లు ఉంటాయి.

### సముద్రంలో రెండు దీవులు

2022లో కేంద్ర పర్యాటక శాఖ బృందం ఈ బీచ్‌ను పరిశీలించింది. అభివృద్ధి పరచడానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేసింది. గోవిందపల్లిపాళె-శ్రీనివాససత్రం మధ్య ప్రాంతంలో తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో సముద్రంలో రెండు దీవులు ఉండడాన్ని గుర్తించింది. దిబ్బల్లా ఉన్న వీటిలో చెట్లు కూడా ఉన్నాయి. వీటిని అభివృద్ధి పరిస్తే పర్యాటకుల రాకపోకలు పెరిగే అవకాశం ఉంటుంది. అలాగే తీరం వెంబడి చిన్న చిన్న పిక్‌నిక్ పాయింట్‌లు ఏర్పాటు చేయచ్చని భావించింది. అయితే ఆ నివేదిక అతీగతీ ఏమైందో మాత్రం తెలియదు.



శ్రీనివాససత్రం నుంచి కనిపిస్తున్న కృష్ణపట్నం పోర్టు

క్రైం కార్నర్

# 22కిలోల గంజాయి స్వాధీనం

- ఆరుగురు నిందితుల అరెస్ట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో 22 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ సుబ్బరామిరెడ్డి కథనం మేరకు ముందస్తు సమాచారంతో ఎం.కొంగరవారిపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన సామిరెడ్డి బేబీ పరిసరాల్లో యానాదుల నుంచి గంజాయి సేకరించి తిరుపతిలో విక్రయించేది. తిరుపతికి చెందిన రమ్య ఇందుకు సహకరించేది. ఈక్రమంలో సామిరెడ్డి బేబీ విశాఖ నుంచి గంజాయి తీసుకువచ్చాడు. దానిని కొనుగోలు చేసేందుకు తిరుచానూరుకు చెందిన నరసింహ, కార్తీక్, ప్రవీణ్, మణికంఠ, అబ్దుల్ కయాం జుబేర్(ఉత్తరప్రదేశ్)లు ఎం.కొంగువారిపల్లి దగ్గర జగనన్న కాలనీకి వచ్చారు. అదే సమయంలో రెవెన్యూ అధికారుల సహకారంతో పోలీసులు, దాడులు చేశారు. ఆరుగురిని అరెస్టు చేశారు. రమ్య పరారైయింది. గంజాయితోపాటు బైక్, కొంతనగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.3.82 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను కోర్టుకు తరలించారు. మీడియా సమావేశంలో ఎస్ఐ అనిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయన సామాన్యుడు కాదు!

- మాజీ ఆర్డీవో కూడబెట్టింది రూ.150 కోట్లకుపైనే



శనివారం నాటి ఏసీబీ అధికారుల తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పదోన్నతులపై ఆయన ఆర్డీవో స్థాయికి చేరారు. ఈ కాలంలో లెక్కలేనంత ఆర్జించారు. అతని ఆస్తి మార్కెట్ విలువ ప్రకారమే రూ.150 కోట్లకుపైగా ఉంటుందని అధికారుల అంచనా. బయట రూ.230 కోట్లకుపైనే ఉండొచ్చని అంటున్నారు. ఆయనే మదనపల్లె మాజీ ఆర్డీవో మురళి. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ఫైళ్ల దగ్ధం కేసులో ప్రస్తుతం ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు. ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే ఫిర్యాదులతో రెండు రోజులుగా ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో కడప, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, పలమనేరు, వి.కోట, మదనపల్లె ప్రాంతాల్లో సోదాలు జరిపారు. ప్రొహిబిషన్ డిప్యూటీ తహసీల్దార్ నుంచి ఆర్డీవో క్యాడర్ వరకు సర్వీసు మొత్తం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రెవెన్యూ శాఖలోనే పనిచేశారాయన. రెవెన్యూ వ్యవహారాలపై మంచి పట్టు సాధించారు. ఈ క్రమంలో రాజకీయంగానూ పలుకుబడి పెంచుకున్నారు. ఓ మాజీ మంత్రి అండతోనే భారీగా ఆస్తులు సమకూర్చుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ క్రమంలో ఏసీబీ అధికారుల దర్యాప్తులో ఇతడి ఆస్తుల చిట్టా బయటపడింది. ప్రధానంగా తిరుపతిలోని తనపల్లి క్రాస్ వద్ద రూ.20 కోట్ల నుంచి 25 కోట్ల విలువ చేసే సాయి గ్రాండ్ హోటల్ మురళిపైనే ఉండటం గమనార్హం. ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు కడప, నెల్లూరు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో 35కు పైగా ఆస్తులు వున్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో 20కి పైగా ప్లాట్లు, ఆర్సీపురం, తిరుపతి రూరల్, మదనపల్లె, వి.కోట, చిత్తూరులో 5 నుంచి 10 ఎకరాల వ్యవసాయ భూమి, వి.కోటలోని యాడగిడిలో రెండు పౌల్ట్రీ ఫారాలు, ఐదు ఎకరాల మామిడి తోట, వాయల్పాడులో వ్యవసాయ భూమి, నెల్లూరు జిల్లా ఇందుకూరు పేటలో వ్యవసాయ భూమి, అక్కడే స్టోన్ హౌస్‌పేటలో ఇంటి స్థలాలు ఉన్నట్లు గుర్తించారు. అన్నమయ్య జిల్లా, సత్యసాయి జిల్లాలోనూ మురళికి ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు సోదాల్లో బయటపడింది. మురళితో పాటు ఆయన కుటుంబీకులు, తోటి రెవెన్యూ సిబ్బంది పేరుతో పలు చోట్ల నివాస గృహాలు, డూప్లెక్స్ ఇళ్లు ఉన్నాయని సమాచారం. మొత్తం ఆస్తులకు సంబంధించి 33 డాక్యుమెంట్లు ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. ప్రతి చోటా పంచనామా నిర్వహించి మురళికి సంబంధించిన ఆస్తుల డాక్యుమెంట్లు, బ్యాంకు అకౌంట్ల పాసుపుస్తకాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కిలో బంగారం, 800 గ్రాముల వెండి వస్తువులు సీజ్ చేశారు. ఇక, 20 బ్యాంకు అకౌంట్లు, దాదాపు 10 చోట్ల లాకర్లు ఉన్నాయి. సోమవారం బ్యాంకు లాకర్లు ఓపెన్ చేసి తనిఖీలు చేయనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఆయా బ్యాంకులకు లేఖలు రాశారు. వాహనాలు ఎవ్వరి పేర్లతో రిజిస్ట్రేషన్ చేశారు...చర, స్థిర ఆస్తులు ఇంకా ఎవ్వరి పేర్లతో వుంచారు అనే విషయం డాక్యుమెంట్లు ద్వారా పరిశీలించాల్సి వుందని అధికారులు తెలిపారు. కాగా, ఏసీబీ అధికారుల తనిఖీలు ముగియడంతో మురళిని అరెస్టు చేసి ఆదివారం సాయంత్రం నెల్లూరు ఏసీబీ న్యాయస్థానం వద్దకు తీసుకెళ్ళారు.



కుటుంబ సభ్యులతో భానుప్రకాష్‌రెడ్డికి ఘన సన్మానం

# టీటీడీ సభ్యుడు భానుకు ఘన సన్మానం

- కృషికి తగిన పదవి అన్న వక్తలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డికి ఆయన మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని మహతిలో సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆయన కృషికి తగిన గుర్తింపే.. ఈ పదవి అని పలువురు పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు ఎవరూ టీటీడీ పరిపాలనలో జోక్యం చేసుకోవద్దని సీఎం చంద్రబాబు టీడీఎల్పీ సమావేశంలో ఆదేశించిన మేరకే తాము ఉంటున్నామన్నారు. అయితే, పద్మావతి అమ్మవారు, శ్రీవారిమెట్టు, శ్రీనివాసమంగాపురం, చంద్రగిరి కోట తదితర ప్రాంతాలతోపాటు నియోజకవర్గంలో అభివృద్ధికి టీటీడీ సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి సహకరించాలని కోరారు. టీటీడీ సభ్యుడిగా భానుప్రకాష్‌రెడ్డి రెండోసారి నియమితులు కావడం ఆయన శ్రమకు భగవంతుడు ఇచ్చిన ప్రతిఫలమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళి అన్నారు. కలియుగ దైవం శ్రీవారి ఆలయాన్ని ఎవరూ పరిపాలించలేరని.. అందుకే టీటీడీ పాలకమండలిని ధర్మకర్తల మండలిగా వ్యవహరించాలని మాజీ జేఈవో శ్రీనివాసరాజు సూచించారు. తిరుపతిలోని టీటీడీ విద్య వైద్య సంస్థల్లో స్థానికులకు ఉచిత విద్య, వైద్యం అందించేలా భానుప్రకాష్‌రెడ్డి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. టీటీడీపట్ల చిన్న అపచారం, దుష్ప్రచారం జరిగినా పార్టీలకు అతీతంగా ఏకం కావాలని తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుమల స్థానికులు ఎంతో త్యాగం చేశారని, వారికి న్యాయం చేసేందుకు భానుప్రకాష్‌రెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీవారి అనుగ్రహం, తన తల్లిదండ్రులు, కుటుంబం చేసుకున్న పుణ్యఫలంతోనే తాను రెండోసారి సభ్యుడిని కాగలిగానంటూ భానుప్రకాష్‌రెడ్డి భావోద్వేగం చెందారు. ఇది హోదా కాదు.. బాధ్యతన్నారు. శ్రీవారిపట్ల, సనాతన ధర్మం పట్ల ఎటువంటి అపచారం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. మొదటి సమావేశంలోనే పాలక మండలి స్థానంలో ధర్మకర్తల మండలిగా వ్యవహరించాలని ప్రతిపాదిస్తానన్నారు. స్విమ్స్‌ను మరింతగా అభివృద్ధి చేయడమే తన తొలి ప్రాధాన్యంగా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్ని అపశ్రుతులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఆ క్రమంలోనే తానూ శ్రీవారికి, భక్తులకు సేవ చేస్తానని చెప్పారు. తనను సభ్యుడిగా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జనసేనాని పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, తన పార్టీ అధినాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ సభ్యుడు అనంత్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు, బీజేపీ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, పొన్నగంటి భాస్కర్, జీవన్‌రాయల్, క్రెడాయ్ అధ్యక్షుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న శ్రీనివాసరాజు



ఆర్మీలో ఎంపిక కోసం పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

# గెలుపే లక్ష్యంగా పరుగెత్తాలి

- యువతకు పిలుపునిచ్చిన జేసీ అదితిసింగ్
- కడపలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కడప స్పోర్ట్స్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరుగెత్తాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. కడపలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో ఆదివారం వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నన్ పునీత్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ఫిజికల్ టెస్ట్‌కు 13 జిల్లాల నుంచి అభ్యర్థులు పాల్గొననున్నారు. మొదటి దశ పరుగును జేసీ అదితిసింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ విజయకాంక్షతో ముందడుగు వేయాలన్నారు. ఈ ఎంపికలో విజయం సాధించి దేశానికి భద్రతనిచ్చే గొప్ప యువశక్తిగా నిలవాలని ఆకాంక్షించారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ ర్యాలీకి కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల,అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.వీరిలో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులకు ఐదురోజులపాటు ఎంపిక పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎవరు ఏరోజు రావాలనేది ఆర్మీ అధికారులు ముందుగానే కాల్ లెటర్లు పంపించారు.





ఆర్మీ ఎంపిక కోసం వివిధ సామర్థ్య పరీక్షలు

# ముద్దుగారే యశోద

**శిల్పారామంలో అలరించిన నృత్యప్రదర్శన**



తిరుచానూరురోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులో భాగంగా ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యరూపకం అలరించింది. శివగౌరి నృత్యాలయం కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. భావిష, ఆశ్రిత, కీర్తన, ధామిని, షన్విక, హనన్య, శ్రీనిధి, సహస్ర, ప్రియ, రోషిణి తదితరులు నాగేంద్ర హరాయ, సౌభాగ్య లక్ష్మి, వక్రతుండ మహాకాయ, మహాగణపతిం, ముద్దుగారే యశోద, బ్రహ్మమొక్కటే, శ్రీమన్నారాయణ వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

## శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.79 కోట్లు

తిరుమల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ ఆదాయ వివరాలను టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 73,558 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,675 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## రాష్ట్రాభివృద్ధి పరుగులు: పాశం



తిరుపతి బస్సు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం

కోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. కోట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం వాకాడు డిపోకు చెందిన కోట, తిరుపతి, కోట, నెల్లూరు బస్సు సర్వీసులను డీఎం ముప్పాళ్ల పెంచలయ్యతో కలిసి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యేతో పాటు పలువురు దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. అలాగే తిన్నెలపూడి ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఐదేళ్లపాటు అంధకారంలో ఉండిపోయిందన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని, ఇందులో ఎన్ని ఆటంకాలు ఎదురైనా వెనుకడుగువేసే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, దారా సురేష్, షంషుద్దీన్, మస్తాన్‌బాషా, భాస్కర్‌రెడ్డి, పోలయ్య, చిల్లకూరు దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

ఓజిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు అన్నారు. ఆదివారంఆయన మండలంలోని యూనిట్ ఇన్‌చార్జిలు, నాయకులతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సూచనలతో సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని సూచించారు.

## వైసీపీకి వినోద్‌రెడ్డి రాజీనామా


ఎమ్మెల్యే సమక్షంలో రాజీనామా పత్రాన్ని చూపుతున్న వినోద్‌రెడ్డి

కోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం కోటలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామ పత్రాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడికి పంపుతున్నట్లు తెలిపారు. అలాగే కోట ఎంపీటీసీ మోబిన్‌బాషా, సర్పంచు వెంకటరమణమ్మతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు వైసీపీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. వీరంతా మంత్రి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు ఎమ్మెల్యే పాశం చెప్పారు.

## సత్యనారాయణ వ్రతం పూజలు


సామూహిక సత్యనారాయణ వ్రతం పూజల్లో భక్తులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని రుక్మాబాయి సమేత పాండురంగ విఠలనాథ స్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతం పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో వ్రతపూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూఏ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జనవరిలో తమిళనాడు రాష్ట్రం సెలంలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ హ్యాండ్‌బాల్ పోటీల్లో కళాశాలకు చెందిన ప్రసాద్, మనోప్రియ, వెంకటసౌమ్య వినయ్ పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.

## లైసెన్సు లేని వాహన చోదకులపై చర్యలు

ఓజిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్‌ఐ స్వప్న స్పష్టం చేశారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మద్యం తాగి, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనదారులు అన్ని పత్రాలు కలిగి ఉండటంతో పాటు హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సూచించారు.

## పేదలకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాధయ్య, శివశంకర్, శశిధర్, మంజుభార్గవి, రాము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంబలేరు బ్రిడ్జి వద్ద శనివారం అర్థరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు... మండలంలోని పోటుపాళెం గ్రామానికి చెందిన శివప్రసాద్(19) పాల ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్థరాత్రి నెల్లూరు జిల్లా మనుబోలు నుంచి ఆటోలో పాలు తీసుకుని గూడూరుకు వస్తుండగా పంబలేరు బ్రిడ్జి వద్ద ఓ కారు అదుపుతప్పి ఆటోను ఢీకొంది. దీంతో ఆటో నడుపుతున్న శివప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నాయుడుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున పండ్లూరు సమీపంలో రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నక్వసింగ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉగ్గపట్టి ఉండాల్సిందే..!

**పట్టణంలో మరుగుదొడ్లు లేక జనం అవస్థలు**





చెంగాళమ్మ ఆలయ సమీపంలో నిర్మించిన మరుగుదొడ్లు ఎదుట దుకాణం - ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఆటోస్టాండులా మరుగుదొడ్లు

సూళ్లూరుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణ, పరిసరాల శుభ్రత లక్ష్యంగా సామాజిక మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉండగా సూళ్లూరుపేట పట్టణంలో పలుచోట్ల వాటి ఊసేలేకుండా పోయింది. ఉన్న చోట వాటి నిర్వహణ కరువైంది. దీంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సూళ్లూరుపేట నియోజకవర్గ కేంద్రం కావడంతో చుట్టుపక్కల మండలాలకు చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బజారు కూడలి, బస్టాండు సెంటర్, షార్ బస్టాండు వద్ద రద్దీ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా రెవెన్యూ, ఆర్డీవో కార్యాలయం, మండల పరిషత్, మున్సిపాలిటీ, విద్యుత్, సబ్ రిజిస్ట్రార్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. వీరంతా తమ పనిపూర్తయ్యే వరకు ఇక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. ఈ సమయంలో మూత్ర, మల విసర్జనకు వెళ్లాలంటే మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. చెంగాళమ్మ ఆలయానికి వెళ్లే దారిలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద మరుగుదొడ్లు ఉన్నా అవి వినియోగంలో లేవు. వాటి వద్ద కొందరు వ్యాపారస్తులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాల పక్కన రోటరీ సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నా ముందర ఆటోస్టాండు ఉండడంతో జనానికి అసౌకర్యంగా ఉంది.

### ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇదే పరిస్థితి

ఆర్డీవో, మున్సిపాలిటీ, రెవెన్యూ, మండల పరిషత్, సబ్ రిజిస్ట్రార్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఆయా కార్యాలయాల సమీపంలో మరుగుదొడ్ల సౌకర్యం లేదు. కొన్ని కార్యాలయాల వద్ద ఉన్నా సిబ్బందికి మాత్రమేనని బోర్డులు పెట్టారు. అధికారులు స్పందించి పట్టణంలో మరుగుదొడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మాతృభాషలోనే బోధన జరగాలి: మాజీ ఎమ్మెల్సీ విఠపు


సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానం కోసం జారీ చేసిన 117 జీవోను రద్దు చేసి మాతృభాషలోనే బోధన జరిగే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన స్వర్ణోత్సవ సంబరాల వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విఠపు మాట్లాడుతూ 50సంవత్సరాల యూటీఎఫ్ ప్రస్థానంలో ఎందరో త్యాగధనుల ఫలితంగా ఉపాధ్యాయులకు అనేక రకాల సౌకర్యాలు సమకూరాయన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించి, హైస్కూల్ స్థాయిలో రెండు మీడియంలను ఎంచుకోవ డానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాయుడు, బాబురెడ్డి, చంద్రశేఖర్, శేఖర్, సునీలా పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల హక్కుల సాధనే యూటీఎఫ్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న నవకోటేశ్వరరావు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల హక్కుల సాధనే లక్ష్యంగా 50 ఏళ్లుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టడం జరిగిందని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమాల ఫలితంగా ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్‌లు, ఇతర సదుపాయాలు సాధించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించు కునేందుకు అందరం సమిష్టిగా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్మల, సూర్యప్రకాష్, రామచంద్రయ్య విజయభాస్కర్, సుధీర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మదీనా కాలనీలో కార్డెన్ సెర్చ్


బైక్ పత్రాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తడకండ్రిగ పంచాయతీ మదీనా కాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. సరైన పత్రాలు లేని 13 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐలు కొండపనాయుడు, బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకే...

చిల్లకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రించేందుకే గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ కిషోర్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక మిక్సిడ్‌కాలనీ, వడ్డిపాళెం ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా కొత్తవారికి ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో ఆధార్‌కార్డు పరిశీలించి పూర్తివివరాలు తెలుసుకుని ఇళ్లను అద్దెకు ఇవ్వాలని సీఐ సూచించారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్ర మంలో ఎస్‌ఐలు సురేష్‌బాబు, మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## వన భోజనం


వనభోజన కార్యక్రమంలో భక్తులు

గూడూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక త్యాగరాజవీధిలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఉచిత వైద్య శిబిరం

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రోటరీ క్లబ్, నియో కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ కంటి వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నందిత, ప్రవీణ్ 75 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు తిరుమూరు సుధాకర్ రెడ్డి, కార్యదర్శి రామకృష్ణ, ప్రాజెక్టు చైర్మన్ కుమారస్వామి, నియో కేర్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## కమనీయం... వెంకటేశ్వరుడి కల్యాణం


స్వామి అమ్మవార్లకు కల్యాణం జరుపుతున్న వేదపండితులు

కోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి పంచాయతీలో గల లక్ష్మక్కకండ్రిగలో ఆదివారం రాత్రి పద్మావతి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వందలాది మంది భక్తుల సమక్షంలో ప్రసన్న వెంకటేశ్వరుడికి పద్మావతి, అలివేలు అమ్మవార్లకు తాళికట్టె సన్నివేశాలను పండితులు భక్తులకు చూపెట్టారు. భక్తులు పోటాపోటీగా కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా స్వామివారి ఆలయ నూతన ప్రారంభం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో వైభవంగా జరిగాయి.

## శబరిమలైకు సైకిల్‌యాత్ర


శబరిమలై సైకిల్‌యాత్రలో అయ్యప్ప భక్తులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు శబరిమలైకు ఈనెల 6వ తేదీన చేపట్టిన సైకిల్‌యాత్ర ఆదివారం గూడూరుకు చేరుకుంది. కొత్తగా స్థానిక కాశీ లేఅవుట్‌లో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని భక్తులు పూజలు చేశారు. అనంతరం శబరిమలైకు సైకిల్‌యాత్రను కొనసాగించారు.

## తాళమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు గ్రామదేవత తాళమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మాతా పరమేశ్వరికి...

నాయుడుపేట టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారపేటలో వెలసిన మాతా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు.

## ముత్యాలమ్మకు...

చిల్లకూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యామ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## అక్రమాలు చేయలేదని వెంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేస్తావా?

● వైసీపీ నేత కామిరెడ్డికి టీడీపీ నేతల సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి నేతలపై నిత్యం అసత్య ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేత, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని ఆయన విశ్వసించే వెంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేయగలరా అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని చావాలి పంచాయతీ చెక్‌పోస్టు గిరిజన కాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని కామిరెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు శిరసనంబేడు సిద్దేశ్వరస్వామి కొండతో పాటు రోసనూరు భూపతేశ్వరస్వామి కొండను కొల్లగొట్టిన సంగతి ప్రజలు మర్చిపోరన్నారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో స్వర్ణముఖి నదిలో పేదలకు ఇసుకను తీసుకోనివ్వకుండా అడ్డుకునేందుకు కోర్టును ఆశ్రయించిన కామిరెడ్డి వైసీపీ అధికారంలోకి రాగానే విచ్చలవిడిగా ఇసుక, గ్రావెల్, మట్టి కొల్లగొట్టలేదా అని ప్రశ్నించారు. ఎన్నో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులు కూటమి నేతలను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తప్పుడు ఆరోపణలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించు కోక తప్పదని సత్యనారాయణరెడ్డిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నేలపల్లీ సిద్దులయ్య నాయుడు తదితరులు ఉన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధాత్రివృక్ష పూజలు


ధాత్రివృక్ష పూజల్లో భక్తులు

చిల్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాసం సందర్భంగా కోట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో ధాత్రి వృక్ష పూజలు నిర్వహించారు. అనంతరం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ధాత్రివృక్ష పూజల్లో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకుని, వనభోజనం స్వీకరించారు.

## విచారణకు హాజరైన కామిరెడ్డి

నాయుడుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి విచారణకు ఆదివారం హాజరయ్యారు. రూరల్ సీఐ సంఘమేశ్వరరావు విచారణ చేపట్టారు. పెళ్లకూరు మండలం చిల్లకూరులో జరిగిన రెండు కేసుల్లో కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని విచారించారు. అనంతరం బయటకు వచ్చిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో అమెరికాలో ఉన్న నాపై అప్పట్లో కూడా కేసులు నమోదు చేశారని అన్నారు. అక్రమ కేసులు బనాయించడం సబబుకాదన్నారు.

## సురేష్‌రెడ్డికి సత్కారం


సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు నన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నెల్లూరులోని సురేష్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాలుతో సత్కరించారు. అదేవిధంగా టీడీపీ నేత నరసింహయాదవ్‌కు పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.

## ఉచితంగా షుగర్ పరీక్షలు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చెన్నైకు చెందిన కార్యన్ హెల్త్‌కేర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది సహకారంతో ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌వీరావు, ఎస్ఎల్ఎన్‌స్వామి పాల్గొన్నారు.


షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

## ఘట్కా పోటీలు...
# జాతీయస్థాయి జట్ల ఎంపిక





జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన అండర్19 బాల, బాలికల జట్లు బాలికలు

రేణిగుంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఘట్కా ఎంపిక పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ఏజీఎఫ్ కార్యదర్శి జయరామయ్య, హెచ్‌డీఎఫ్ కార్యదర్శి బాబు, స్టేట్ అబ్జర్వర్ బాలశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని ప్రదానం చేశారు. డిసెంబరు 1, 2, 3, 4వ తేదీల్లో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని రాష్ట్ర అబ్జర్వర్ బాలశేఖర్ తెలిపారు. ప్రతి జట్టుకు ముగ్గురిని స్టాండ్‌బైగా ఎంపిక చేశామన్నారు.

ఎంపికైన జట్ల వివరాలివీ...

**అండర్19 బాలురు:** కె.పవన్‌కుమార్, గణేష్, వంశీరెడ్డి(వైజాగ్), జగదీష్‌రాం, హేమంత్ కుమార్(కృష్ణ), నాగవేణు(కడప), చందనాయక (చిత్తూరు), దేవకుమార్(ప్రకాశం).

**అండర్17 బాలురు:** హరిచరణ్, సాయిగణేష్, కుషాల్ వెంకట్(ఈస్ట్‌గోదావరి), నవీన్, జయసూర్య (కడప), మనోజ్(కర్నూల్), హర్షవర్ధన్ (వైజాగ్), నరేంద్ర(కృష్ణ)

**అండర్19 బాలికలు:** ధాత్రి, రోజా, రాజశ్రీ (చిత్తూరు), జ్యోత్స్న, ఉదయశ్రీ, మమత (వైజాగ్), షణ్ముఖి(ఈస్ట్‌గోదావరి), ధరణి (ప్రకాశం).

**అండర్17 బాలికలు:** దీక్షిత, హరితసెల్వి, కీర్తన(కడప), జాస్మిత(వైజాగ్), కారుణ్య హర్షిత(ఈస్ట్‌గోదావరి), వర్ష(కర్నూల్), సరయ(కృష్ణ)

## మంచినీళ్ల గుంట అభివృద్ధి చెందేనా?



పిచ్చి మొక్కలతో నిండిపోయిన మంచినీళ్ల గుంట

రేణిగుంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న మంచి నీళ్ల గుంటకు మోక్షం ఎప్పటికి కలుగుతుందో అని స్థానికులు ఎదురు చూస్తున్నారు. మంచినీళ్ల గుంటను అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆచరణకు నోచుకోవడం లేదు. గతంలో మంచినీళ్ల గుంట చుట్టూ ప్రహరీ నిర్మించి చేతులెత్తేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో హడావుడిగా రూ.75లక్షల తుడా నిధులు వెచ్చించి గుంట లోపల వాకింగ్ ట్రాక్, బెంచీలు, చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఉయ్యాల, మూడు దుకాణాలను నిర్మించారు. అయితే పనుల బిల్లు చెల్లించకముందే కొన్ని ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్ కుంగింది. ఇప్పటికైనా మంచినీళ్ల గుంటపై ఎమ్మెల్యే సుధీర్ దృష్టి సారించి తిరుపతి రామచంద్ర పుష్కరణిలా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

## లో వోల్టేజీతో కంచరపాళెంవాసుల ఇబ్బందులు



వరదయ్యపాళెం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచరపాళెంలో 125 కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే ఈ గ్రామంలో లో వోల్టేజీ సమస్య ప్రజలను పీడిస్తోంది. అలాగే తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. లో వోల్టేజీ కారణంగా విద్యుత్ గృహోపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయి. గతంలో ఈ సమస్యను ఎమ్మెల్యే ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లామని అయినా పరిష్కారం కాలేదంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పాతది కావడంతోనే ఈ సమస్య తలెత్తుతున్నట్టు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# పుత్తూరు వార్తలు

## అధికారులు నిబద్ధతతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు నిబద్ధతతో పని చేసి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. పుత్తూరులో గం జాయిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. నింద్ర, విజయ పురం, వడమాలపేట మండలాల్లో గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. మినీ గోకులాలు అందిరికి అందేలా ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని చెప్పారు.డీకేటీ భూములు అర్హులకు అందజే యాలని తహసీల్దారును కోరారు. టీడీపీ నాయకులు చినబాబు, గంజిమాధవయ్య, డీఎస్ ఎలుమలై, నారాయణబాబు, ప్రతాప్‌రాజు, రవిశేఖర్‌రాజు, బాలసుబ్రమణ్యం రాజు, ఆనంద్, యుగంధర్ తహసీల్దారు వెంకటేశ్వర్లు, రవి కుమార్, జరీనా, ఎంపీడీవో రమేష్ బాబు, డీ ఎస్పీ రవికుమార్, నగరి సీఐలు సురేంద్ర నాయుడు, భాస్కర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ రవిరాజుకు గౌరవ ఫెలోషిప్



పుత్తూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్స్ నుంచి గౌరవ ఫెలోషిప్ అవార్డును పుత్తూరుకు చెందిన వైద్యుడు రవిరాజు అందుకున్నారు. చెన్నైలో జరిగిన ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఫ్యామిలీ ఫిజీషియన్స్ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ రవిరాజును ఐకాన్ 24గా ఎంపిక చేసి అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అశోకన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, కార్యదర్శి డాక్టర్ అన్బురాజన్, డీన్ డాక్టర్ సత్యజిత్ బోరాలు పాల్గొన్నారు.

## చిన్నారి కుటుంబానికి ప్రభుత్వ అండ



శాన్విక కుటుంబీకును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

వడమాలపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కామాంధుడి చేతిలో బలైన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే భానుప్రకాష్ చెప్పారు. ఆదివారం ఉదయం మండలంలోని ఏఎంపురంలో హత్యాచారంలో బలైన శాన్విక కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ముందుగా చిన్నారికి నివాళులర్పించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. చిన్నారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంటన నాయకులు ధనంజయులు నాయుడు, చినబాబు, వెంకటయ్య, మురళీధర్ రెడ్డి, లోకరాజు, వెంకటేశ్వరరావ్, హేమావతి, మునిశేఖర్, మునిరత్నం, తహసీల్దార్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువును సన్మానిస్తున్న విద్యార్థులు

వడమాలపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఒకరికొకరుఆత్మీ అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1990-91 పదవ తరగతి విద్యార్థులు గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గత ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ఉన్నతి కోసం ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామని తెలిపారు. గతంలో త్రాగునీటి కోసం బోరు ఏర్పాటు చేస్తామని, ఆర్వో వాటర్ అందిస్తామని తెలిపారు. పూర్వ విద్యార్థులు రమాదేవి, డేవిడ్, చంద్రశేఖర్ లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఢిల్లీ ప్రసాద్, కిరణ్, దాము, బిపి బాబు, హేమానంద్, రవి, ఉషారాణి, షణ్ముఖీ, మల్లిక, నవరత్నకుమారి పాల్గొన్నారు.

## మా ప్రాంతంలో మద్యం దుకాణం వద్దు

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తరాశిపాళెం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ మహిళలు వ్యతిరేకిస్తున్నారు. నాయుడుపేట రోడ్డుకు ఆనుకుని మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో తమ ప్రాంతంలో ఇళ్ల మధ్య మద్యం దుకాణం పెట్టవద్దంటూ స్థానిక మహిళలు శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# వర్షాలకు గుంతలమయమైన జంబుగోళం రోడ్డు





ఆర్ అనంతపురం వద్ద కోసుకుపోయిన రోడ్డు - చిన్నాయ్యగుంట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు పదవమైలు నుంచి జంబుగోళం వెళ్లే రోడ్డు ఇటీవల కురుస్తున్న మోస్తరు వర్షాలకు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో పది గ్రామాల ప్రజల ప్రయాణం దుర్భరంగా మారింది. పదవమైలు నుంచి జంబుగోళం వరకు పది గ్రామాలను అనుసంధానిస్తూ 8 సంవత్సరాల క్రితం తారు రోడ్డును నిర్మించారు. గత ఐదేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో రోడ్డు పలు చోట్ల గుంతలమయమైంది. పూసలపల్లి, జీఎన్‌కండ్రిగ, ఆర్‌అనంతపురం వద్ద రోడ్డు పూర్తిస్థాయిలో దెబ్బతింది. ఈ రోడ్డు మీదుగా సూళ్లూరుపేట, దొరవారి సత్రం మండలాల ప్రజలు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు దారుణంగా తయారైందని గ్రామీణులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కన్నబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజా నాట్య మండలి కార్యాలయానికి శంకుస్థాపన



శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ప్రజా నాట్య మండలి ప్రాంతీయ కార్యాలయ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ... పాలక ప్రభుత్వాల లోటుపాట్లను పాటల రూపంలో ఎండగట్టడంలో ప్రజా నాట్య మండలి ముందుంటుందన్నారు. వేణు, సెల్వరాజు, హరికృష్ణ, కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధర్నాలను జయప్రదం చేయండి



శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వాలి.. గృహ నిర్మాణం కోసం రూ.5లక్షలు చొప్పున మంజూరు చేయాలి.. తదితర డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 18న సచివాలయాల వద్ద జరిగే ధర్నాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తులసీరాజన్, జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ కోరారు. ఆదివారం అమ్మపాళెంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మణి, శ్రీనివాసులు, నరసింహారావు, రాజయ్య, వినాయక, చెంగమ్మ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా కార్యాలయం ప్రారంభం

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అగ్నిమాపక కార్యాలయం పక్కన ఆదివారం ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ... ప్రభుత్వం వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. మురళీకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, పాండురంగ వరప్రసాద్, అశోక్ కుమార్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్




రేణిగుంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో డ్రైవర్లకు అర్బన్ పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ శరత్‌చంద్ర చెప్పారు. అలాగే ఎక్కువమంది ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకో కూడదన్నారు. ఆటో నడిపే సమయంలో యూనిఫాం ధరించి రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు తప్పవన్నారు. అలాగే అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## హైందవ శంఖారావం సన్నాహక సమావేశం



శ్రీకాళహస్తిలో కరపత్రాల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను స్వయంప్రతిపత్తి కలిగిన ధార్మిక వ్యవస్థలకు అప్పగిస్తూ చట్ట సవరణ చేయాలని విశ్వ హిందు పరిషత్ తిరుపతి విభాగ ప్రముఖ్ మల్లికార్జున డిమాండ్ చేశారు. విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు సంబంధించి ఆదివారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు, కేవీబీపురం మండలాల కార్యకర్తలతో సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... దేవాలయాలను ప్రభుత్వం తన నిర్వహణలో ఉంచుకుని రాజకీయ పదవులకు పునరావాస, వ్యాపార కేంద్రాలు మారుస్తూ ఆధ్యాత్మిక విలువలకు తిలోదకాలు ఇస్తోందన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శశాంక్, అంజూరు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం:** హైందవ శంఖారావం బహిరంగ సభకు తరలిరావాలని ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ గురుస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని నైస్ స్కూల్‌లో ఆదివారం ఆయన చాలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. దేవాలయాల్లో, దేవ దాయ ధర్మదాయ శాఖలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేని హిందూ భక్తులు మాత్రమే ఆలయ ట్రస్టు బోర్డులో పదవులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవాహ ఈశ్వరయ్య, విభాగ్ ప్రచారక్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## రమేష్‌రాజు ఆరోపణలు అవాస్తవం



ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఉద్యోగులు, అర్చకులు

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ కాంట్రాక్ట్ ఉద్యోగి రమేష్‌రాజు కొందరు ఆలయ ఉద్యోగులపై చేసిన ఆరోపణలు అవాస్తవమని ముక్కంటి ఆలయ ఉద్యోగ సంఘ నాయకులు అన్నారు. ఆదివారం రమేష్‌రాజుపై ఈవో బాపిరెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రమేష్‌రాజు తరచూ అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యేవాడన్నారు. కీలకమైన మహాద్వారం వద్ద విధులు నిర్వహిం చాల్సి ఉండగా వరుసగా మూడురోజుల పాటు స మాచారం ఇవ్వకుండా హాజరు కాక పోవడంతో అప్పటి ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సస్పెండ్ చేశారన్నారు. ఈ క్రమంలో శనివారం తనకు విధులు కేటాయించడానికి ఆలయంలోని ఇద్దరు ఉద్యోగులు రూ.50 వేలు అడుగుతున్నారంటూ ఆత్మహత్యాయత్నానికి తెరలేపాడన్నారు. రమేష్ రాజు విధుల్లో చేరడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. అయితే అసత్య ఆరోపణలతో ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీయడం బాధాకరమన్నారు.

## సభ్యత్వ నమోదు జోరు పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న అంకయ్య చౌదరి

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో జోరు పెంచాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ అంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం సభ్యత్వ నమోదుపై టీడీపీ నాయకులతో ఆయన సమీక్షించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోదయ్యేలా చురుగ్గా వ్యవహరించాలని కోరారు. టీడీపీ సభ్యత్వ నమోదు ద్వారా ఎన్నో ప్రయో జనాలు చేకూరే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గేదెను ఢీకొన్న ఆటో



శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గేదెను ఆటో ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన రాజీవ్‌నగర్ సమీపంలో జరిగింది. రాజీవ్‌నగర్ కాలనీకిచెందిన వేణుగోపాల్ ఆటో డ్రైవర్. తన మిత్రుడుతో కలిసి ఆటోలో శ్రీకాళహస్తికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మయూరనగర్ వద్ద పిచ్చాటూరు రహదారిపై గేదె అడ్డంగా రావడంతో ఢీకొంది. వేణుగోపాల్‌తో పాటు స్నేహితుడు రాజా గాయపడ్డారు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరించారు.

## ఆ భూములు దళితులకే అప్పగించాలి: వైసీపీ

కేవీబీపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు దళితులు సాగు చేసుకుంటున్న భూములను వారికే అప్పగించాలని వైసీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కేవీబీపురంలో మీడియాతో మాట్లాడారు. ఈనెల 9న సాదరు భూములను దళితులే సాగు చేసుకోండని చెప్పిన అటవీశాఖ అధికారులు ఆదివారం పొలాల కు వెళ్తున్న రైతులను అడ్డుకోవడం సబబు కాదన్నారు. తమకు ఉన్నతాధికారులనుంచి సమాచారం అందలేదని చెప్పడం దారుణమన్నారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు ఇద్దరు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి పేదల సాగులో ఉన్న భూమిని వారికి అప్పగించి న్యాయం చేయాలని రాజేష్ కోరారు.

## క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలు

నారాయణవనం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు తెలిపారు. మండలంలోని పాలమంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవాల ముగింపు సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కేశవులు, రాజేంద్ర పిళ్లై, వెంకయ్యనాయుడిని ఘనంగా సన్మానించారు. భాస్కర్, మోహన్‌బాబు, అమర్‌నాథ్, నందకుమార్, కాలప్ప, సుబ్రమణ్యం, ఉమాపతి, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపోరు పోస్టర్ల ఆవిష్కరణ

సత్యవేడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధరలను నియంత్రించి పేదలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కరెంట్ చార్జీలను పెంచి భారాన్ని మోపడం సమంజసం కాదని సీపీఎం మండల కార్యదర్శి ఎం.రమేష్ విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న 'ప్రజాపోరు' పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 14న కలెక్టరేట్లు, మండల కార్యాలయాల ఎదుట జరగనున్న ప్రజాపోరు ధర్నాను ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రగతిశీల ఉద్యమ నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మునస్వామి, మహేష్, ఎంజీఆర్, ముత్తు క్రిష్ణయ్య, శాంతి, కౌసల్య శ్యామల, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### నేడు వైష్ణవ కోనేరులో లక్ష దీపారాధన

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఉన్న వైష్ణవ కోనేరులో ఈనెల 11న సోమవారం లక్ష దీపారాధన నిర్వహిస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. సోమవారం ప్రదోష కాలంలో సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య లక్ష దీపారాధన జరుగుతుందన్నారు.

### పోక్సో కేసుల నమోదు

ఏర్పేడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఏర్పేడు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. రేణిగుంటకు చెందిన యువకుడు ఏర్పేడుకు చెందిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

**శ్రీకాళహస్తి:** బాలికను వేధిస్తున్నాడన్న ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ రవి నాయక్ తెలిపిన వివరాలు... మేరకు శ్రీకాళహస్తి మండలానికి చెందిన బాలికను యువకుడు వేధించేవాడు. దీనిపై బాలిక తన తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో రెండు కుటుంబాల నడుమ శనివారం గొడవ జరిగింది. ఈ ఘటనలో బాలిక బంధువు తలకు తీవ్రగాయమైంది. ఆయన్ను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తర లించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదైంది.

### ఆగమోక్తంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ వేద పండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు దర్శించుకున్నారు.

### దర్గామిట్టలో కార్డన్ సెర్చ్



శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్గామిట్టలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ నరసింహమూర్తి ఆదేశాల మేరకు 1వ పట్టణ సీఐ గోపి ఆధ్వర్యంలో వేకువజామున పట్టణంలోని దర్గామిట్టలో పోలీసు బలగాలు జల్లెడపట్టాయి. రికార్డులు లేని సుమారు 17 ద్విచక్రవాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆకతాయిలు రోడ్లపై సమస్యాత్మకంగా ప్రవర్తిస్తే పోలీసులకు ఫిర్యాదుచేయాలని తెలిపారు.

### జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



తొట్టంబేడులో జరిగిన సభ్యత్వ నమోదు

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెం పంచాయతీలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరుగా సాగింది. పార్టీ మండల అధ్యక్షుడు గాలి మురళినాయుడు ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వం చేయించారు. సభ్యత్వం తీసుకోవడం వలన కలిగే లాభాలను ప్రజలకు వివరిం చారు. ఈ కార్యక్రమంలో మునిచంద్రారెడ్డి, శివ, దుర్గారెడ్డి, చెంగయ్య, వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.